క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్

సబ్బవరం: పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో లలిత కుమారి తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం శివారు అమరపిన్నివానిపాలెం, జగన్నాథపురం, అప్పయ్యపాలెం గ్రామాల్లో పోషణ్ పక్వాడాపై గురువారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద స్టాల్స్‌ను ప్రదర్శించి ఆకు కూరల్లో లభించే పోషకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మోపాడ అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దాడి అప్పలనర్సమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ముగిసిన శిక్షణ

సబ్బవరం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చైతన్య పాల్గొన్నారు.

ఘనంగా బర్ధన్ జయంతి



బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: భారత కమ్యూనిస్ట్ పార్టీ తొలితరం నేత, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ 101వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 97వ వార్డు బర్ధన్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సీపీఐ నేత ఆర్.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల కోసం బర్ధన్ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. సీపీఐ కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పిల్లలకు డ్రాప్స్ వేస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: పిల్లల్ని జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచుతూ, వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలని కార్పొరేటర్ శానాపతి వసంత అన్నారు. చినముషిడివాడలోని అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హనీషా, నాయకులు శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్‌లో విస్తం విద్యార్థుల ప్రతిభ



హ్యాక్‌థాన్‌లో పాల్గొన్న విస్తం విద్యార్థులు

పెందుర్తి: స్మార్ట్ ఇండియన్ హ్యాక్‌థాన్ ఆధ్వర్యంలో పినగాడి సమీపంలోని విస్తం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంటర్నల్ హ్యాక్‌థాన్ నిర్వహించారు. కళాశాలలోని అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు 30 బృందాలుగా ఏర్పడ్డారు. అందులో 25 బృందాలు సాఫ్ట్‌వేర్, 5 బృందాలు హార్డ్‌వేర్ విభాగంలో హ్యాక్‌థాన్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. కళాశాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

బొమ్మలకొలువు.. సంప్రదాయాల నెలవు



సింహాచలం: ఏటా శరన్నవరాత్రి ఉత్సవాల్లో బొమ్మల కొలువుతో తమ ప్రత్యేకతను చాటుతున్నారు సింహాచలం దరి బాలాజీనగర్‌లో ఉంటున్న మూల ప్రసాద్, భారతి దంపతులు. 23 ఏళ్లగా బొమ్మలకొలువును ఏర్పాటు చేస్తున్నారు. మూల ప్రసాద్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తుండగా, ఆయన భార్య భారతి స్పెషల్ మెజిస్ట్రేట్‌గా పనిచేశారు. ఈసారి బొమ్మలకొలువులో దేవతామూర్తులు, కోనసీమ, కంచి కామాక్షి, కుంభకర్ణుడు, గోకులం, ట్వంటీ ట్వంటీ క్రికెట్, వివాహం, సీమంతం, బారసాల, రాజస్థాన్ నివాసితుల జీవన విధానం తదితర నమూనాలతో బొమ్మల కొలువుని ఏర్పాటు చేశారు.



కుక్కలు భౌబోయ్!



- పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- భయాందోళనలో వాహనదారులు, చిన్నారులు
- వీధి కుక్కల నియంత్రణ పట్టని యంత్రాంగం

సబ్బవరం: మండలంలో పట్టణం, గ్రామీణ ప్రాంతం అన్న తేడా లేదు. వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారినల్లా కాటేసేందుకు వెంటపడుతున్నాయి. రాత్రి వేళల్లో వాహనాల వెంట పరుగులు తీస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పలు చోట్ల చిన్నారులు, వృద్ధులపై దాడి చేయడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను నియంత్రించాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆహార వ్యర్థాలే కారణం

మండలంలో పలు జాతీయ విశ్వవిద్యాలయాలు, హైవే విస్తరణతో సబ్బవరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో రోడ్ల పొడవునా హోటళ్లు, దాబాలు వెలిశాయి. ఇక్కడ మిగులు ఆహార పదార్థాలు, వ్యర్థాలు ఎక్కడికక్కడ పడేస్తున్నారు. వీటితో పాటు కోళ్ల ఫారాలు మృతి చెందిన కోళ్లను నిర్లక్ష్యంగా రోడ్లపై పడేస్తున్నారు. చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాల గురించి చెప్పాల్సిన పనిలేదు. వీటిని రోడ్లకు ఇరువైపులా పారబోస్తుండటంతో వాటిని పీక్కుతింటూ ల్ నుండి వచ్చే వ్యర్థాలను రోడ్లుకు ఇరువైపుల పారబోయడంతో వీధి కుక్కలు వాటిని పీక్కుతింటూ రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

మండలం కేంద్రంలో నిర్మాణంలో ఉన్న, శిథిలావస్థలో ఉన్న భవనాలను వీధి కుక్కలు ఆవాసంగా చేసుకుంటున్నాయి. అక్కడ నుంచి గుంపులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ వాహనదారులు, పాదచారులపై ఎగబడి, గాయపరుస్తున్నాయి. రాత్రుళ్లు పలు నివాసాల మెయిన్ గేట్‌ల ఎదురుగా నిద్రిస్తూ ఆ ఇళ్లల్లో ఉన్న వారిని సైతం బయటకు రానీయకుండా భయపెడుతున్నాయి. దీనిపై ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పంచాయతీ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు పట్టించుకోనే పరిస్థితి కనిపించట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



సాయినగర్ కాలనీలో రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



సబ్బవరంలో నిర్మాణంలో ఉన్న భవనంలో చేరిన కుక్కల గుంపు



సాయినగర్ కాలనీలోని ఓ ఇంటి మెయిన్ గేటు ముందు కుక్కలు

గంట వ్యవధిలోనే ఇద్దరిపై దాడి



వీధి కుక్క దాడిలో గాయపడ్డ కర్రి శ్రీనివాసరావు, (ఇన్‌సెట్) గాయపడ్డ కాలు

నా పేరు కర్రి శ్రీనివాసరావు. మాది సబ్బవరం మండలం అసకపల్లి. గత నెల 28న స్టీల్ ప్లాంట్‌లో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నాను. అసకపల్లి–ఎరుకునాయుడుపాలెం రోడ్డులో వీధి కుక్క వెంటపడి మరీ దాడి చేసింది. పాదంపై లోతుగా గాయమైంది. అప్పటి నుంచి ఇంటికే పరిమితమయ్యాను. వ్యాక్సిన్ ఐదు డోసీలలో ఇప్పటికే పెందుర్తి ఆస్పత్రిలో నాలుగు డోసులు వేయించుకున్నాను. ఈ నెల 26న చివరి డోస్ వేసుకోవాలి. నాపై దాడి చేసిన గంట వ్యవధిలోనే మా గ్రామానికే చెందిన కర్రి అప్పలనర్సమ్మ కూడా కుక్క కాటుకు గురైంది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టకపోతే రోడ్లపై తిరిగే పరిస్థితి కనిపించట్లేదు.

వీధి కుక్కల్ని నియంత్రించాలి



మండల కేంద్రంలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. ఎక్కడ చూసినా గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రోడ్లపై వెళ్లేందుకు భయపడే పరిస్థితి. స్కూళ్లకు వెళ్లే చిన్నారులు గురించి తల్లిదండ్రులు చాలా భయపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

– సింగంపల్లి వెంకటరావు, జోడుగుళ్ల

కేసులు పెరిగాయి



ఇటీవల కుక్క కాటు కేసులు పెరిగాయి. రోజూ ఇద్దరు ముగ్గురు బాధితులు పీహెచ్‌సీకి వస్తున్నారు. గాయం తీవ్రత ఆధారంగా 4–5 డోసుల వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అవసరానికి సరిపడా వ్యాక్సిన్లు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటుపై నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదం. నాటు మందులపై ఎట్టిపరిస్థితిలోనూ ఆధారపడి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. – డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి, సబ్బవరం పీహెచ్‌సీ

క్రైం పోలీసులకు సీపీ అభినందన



పెందుర్తి క్రైం విభాగం సిబ్బందిని అభినందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

పెందుర్తి: పలు చోరీ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పెందుర్తి క్రైం విభాగం పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఐ డి.సూరిబాబు, హెచ్‌సీలు జి.నాగరాజు, వి.పేరయ్యనాయుడు, పీసీలు టి.శివప్రసాద్, వి.విజయ్‌కుమార్, బి.దేముడుబాబు, ఎల్.తాతారావు, యు.చంద్రకళను రివార్డులతో సత్కరించారు.

'ఉత్తమ ర్యాంకుల సాధనకు కృషి చేయాలి'



పాఠాలు బోధిస్తున్న డీఐఈవో వినోద్‌బాబు

పరవాడ: నీట్, ఐఐటీ, ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి కళాశాలను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి(డీఐఈవో) మద్దిలి వినోద్‌బాబు విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి సైన్స్, కెమెస్ట్రీ సబ్జెక్టులపై పలు ప్రశ్నలు అడిగి, వారి నుంచి జవాబులు రాబట్టారు. దసరా సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా హోంవర్కు, రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల సౌకర్యాలపై అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి అనంతరం కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉప ప్రధానాచార్యులు సాతులూరి నరసింహాచార్యులు ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేశారు. ఆ జలాలను స్వామికి సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.



కుంభప్రోక్షణలో ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

పరిసరాల పరిశుభ్రతతో రోగాల నియంత్రణ



వేపగుంట గంగిరెడ్లకాలనీలో స్వచ్ఛతాహీ సేవలో జెడ్సీ శంకరరావు, ఎస్ఐ దేముడుబాబు



పులగానిపాలెంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ అయిత సింహాచలం

పెందుర్తి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని జోన్–8 జెడ్సీ(ఇన్‌చార్జ్) సీహెచ్ శంకరరావు అన్నారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట సమీపంలోని గంగిరెడ్ల కాలనీలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా సహకారం అందించాలన్నారు. కాలనీలో మొక్కలు నాటారు. పెందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ దేముడుబాబు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

- జీవీఎంసీ 97వ వార్డు పులగానిపాలెంలో పీఏసీఎస్ చైర్మన్ అయిత సింహాచలం ఆధ్వర్యంలో స్థానికులు శ్రమదానం నిర్వహించారు.
- స్థానిక రైతుబజార్‌లో జీవీఎంసీ అధికారులు తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కలిగించారు. ఈవో పద్మావతి షర్మిల, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడికి అదీప్‌రాజ్ పరామర్శ

సబ్బవరం: మండలంలోని ఇరువాడ ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న బంగారయ్యను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం పరామర్శించారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న ఆయన్ని గ్రామంలోని తన నివాసంలో పార్టీ నేతలతో కలిసి పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో పార్టీ సీనియర్ నాయుకుడు గండి రవికుమార్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, పార్టీ నాయకులు బలిరెడ్డి కనకరాజు, మామిడి బంగారినాయుడు, మచ్చ కోటేశ్వరరావు, పట్నాల శంకర్, మామిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బంగారయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న అదీప్‌రాజ్ తదితరులు

చిరువ్యాపారుల సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

పెందుర్తి: నాయుడుతోట ప్రాంతంలోని తోపుడుబళ్లు, ఇతర చిరువ్యాపారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా వై.రాంబాబు, అధ్యక్షుడిగా పోలిపల్లి ఈశ్వరరావు, కార్యదర్శిగా పంపాన నాగరాజు, ఉపాధ్యక్షుడిగా జె.శరత్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.ప్రదీప్, ఎస్‌కే నజీర్, కోశాధికారిగా వై.ఈశ్వరరావు, సభ్యులుగా మజ్జి సంతోషి, బాణాల కుమారి, 65 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వం నగరంలోని చిరువ్యాపారులపై చేస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా పోరాటంపై త్వరలో కార్యాచరణ రూపొందించనున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు రాంబాబు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

పెందుర్తి: గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ డి.శంకరరావు హెచ్చరించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలను పాడిరైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలన్నారు. గురువారం మండలంలోని సౌభాగ్యరాయపురం(ఎస్ ఆర్ పురం)లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై ఆందోళన



ఫార్మాసిటీలో నిరసన తెలుపుతున్న సిటు నాయకులు

పరవాడ: పని గంటల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఎన్ ఫార్మాసిటీలో సిటు ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం పనిగంటల్ని 8 నుంచి 13 గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికుల సంక్షేమమే ధ్యేయమని, అధికారంలోకి వచ్చాక స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను దోచిపెట్టేందుకు కార్మిక చట్టాలను మార్చడం దుర్మార్గమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు తుంగలో తొక్కి, కార్మికులను మరింత దోపిడికి గురయ్యేలా చట్ట సవరణకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. మహిళలకు రాత్రి డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిటు నాయకులు జి.దేముడు, కె.వెంకినాయుడు, పి.అప్పారావు, ముత్యాలు, రామునాయుడు, రాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి స్పందన

పరవాడ: వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో గురువారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ ఆరోగ్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నాయుడుపాలెం శిబిరాన్ని సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య ప్రారంభించారు. బీపీ, సుగర్, ఈఎన్‌టీ, కంటి, దంత పరీక్షలు, పలు క్యాన్సర్లు, స్త్రీల సమస్యలకు సంబంధించి వైద్య నిపుణులు పరీక్షలు జరిపారు. మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పీహెచ్‌సీ వైద్యులు కనక అప్పారావు, ఫాతిమా బేగం, సిబ్బంది కె.శ్రీనివాసరావు, గణేష్, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కన్వేయన్స్ డీడ్ ఇప్పించాలని వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనలో ముదపాక రైతులు

మహారాణిపేట/పెందుర్తి: పెందుర్తి మండలం ముదపాకలో కన్వేయన్స్ డీడ్ ఇప్పించాలని రైతులు కోరారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్‌ను గురువారం కలిసి వినతి పత్రాలిచ్చారు. ముదపాకలో 1,38,66,75,76,80,82,83 సర్వే నంబర్లలోని భూములు తమ సాగులో ఉన్నాయని, ఇక్కడి తోటలను తాము సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, వీటికి కన్వేయన్స్ డీడ్ ఇప్పించాలని కోరారు.



ఎస్ఆర్ పురంలో గాయిత్రీదేవిగా కనకదుర్గమ్మ



సుజాతనగర్లో కాత్యాయినిగా కనకదుర్గమ్మ




శ్రమశక్తినగర్‌లో అన్నపూర్ణగా పంచముఖ గాయత్రి



పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అన్నపూర్ణగా..



సప్తగిరినగర్‌లో గజలక్ష్మిగా అలివేలు మంగమ్మ



పెందుర్తి అయ్యప్పస్వామి ఆలయంలో అన్నపూర్ణగా..

పాహిమాం.. జగన్మాతా.. రక్షమాం

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రిమాత ఆలయంలో భారీ ఎత్తున కుంకుమార్చన జరిపారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అన్నపూర్ణదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీ ఎత్తున కుంకుమ పూజలు చేశారు. గజలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని కాత్యాయినిగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.